


నన్ను నేను గిల్లుకున్నాను.

“అబ్బా!” నిజమే.

విష్ణుసహస్రనామ స్తోత్రం వినిపిస్తోంది. అది ఎమ్మెస్ సుబ్బులక్ష్మి రికార్డెడ్ వాయిస్ కాదు. మా సుబ్బులు కంఠ స్వరమే. గడియారం వంక చూశాను. ఇంకా ఆరు కాలేదు. గబుక్కున లేచాను. పూజా గదికేసి నడిచాను.

అనుమానం లేదు. అర్ధాంగలక్ష్మి సుభద్రే. భక్తితో పఠిస్తోంది.

"బ్రహ్మణ్యం సర్వ ధర్మజ్ఞం. లోకానాం కీర్తి వర్ధనమ్..." ఏమిటీ వైపరీత్యం? రోజూ ఎనిమిది దాటితేగాని పక్కనుండి లేవటానికి ఇష్టపడని మా సుబ్బులు...పోనీ, ఈ రోజేమైనా పర్వదినమా? అంటే అదేం లేదు. ఫిబ్రవరి ఇరవై, రెండు వేల ఇరవై మామూలు తేదీయే. షాక్ నుండి తేరుకోకుండానే పిల్లల బెడ్రూం వైపు వెళ్ళాను.

అబ్బాయిలిద్దరూ లేరు. అమ్మాయి గౌతమి మాత్రం ఏదో చదువుకుంటోంది. డిస్టర్బ్ చేయకుండా అడుగులో అడుగు వేసుకుంటూ ఏం చదువుతుందోనని వెనక నుండి వెళ్ళి పరిశీలించి, ఉలిక్కిపడ్డాను.

పోతన భాగవతం చదువుకుంటూంది! ఎనిమిదో తరగతి చదివే పసిదానికి ఇదేమర్థమవుతోంది? ఏ కామిక్సో, టెక్ట్స్ బుక్సో చదవక.అదే అడిగాను.

"ష్!!!" మాట్లాడొద్దన్నట్టు తర్జని పెదాలకు అడ్డంగా వుంచి అంది. "నాన్న గారూ! మీకేమైంది? మొహం కడుక్కోకుండా మాట్లాడకూడదనే సంగతి మరచారా? అసలు ఈ సమయానికి స్నానం చేయాలి. ముందు వెళ్ళి మొహం కడుక్కోండి. ఆరు గంటలకి ప్రార్థనకి రారా?" కొంత కఠినంగా మందలించింది.

బిత్తరపోయాను. నోర్మూసుకుని బాత్రూం వైపు పరుగెత్తాను. హడావుడిగా మొహం కడుక్కుని తుడుచుకుంటున్నాను.

ఓ సైరన్ వినిపించింది.

అద్భుతం. హైదరాబాద్‌లాంటి నగరమే క్షణాల్లో నిశ్శబ్దమైపోయింది. 'ఇది కల్పాంతమా?' అనుకుంటూ, జారిపోతున్నగుండెను చిక్కబట్టుకుంటూ బయటికి పరుగెత్తాను.

మా అపార్టుమెంటులోని జనాలంతా బయట ఖాళీస్థలంలో బారులు తీరి నిలుచున్నారు. ముసలీ-ముతకా, చిన్నా-చితకా, పక్క ఫ్లాట్‌లోని బాలింత, పై ఫ్లాట్‌లోని గర్భిణీ స్త్రీ.. అంతే కాదు, పాల మనిషి, పని మనిషి, పేపరబ్బాయి, వాచ్‌మన్.. అందరూ.

మా అమ్మాయి సైగనందుకొని నేనూ పరుగెత్తుకెళ్ళి ఓ వరుస చివర్లో చేరాను.

సరిగ్గా ఆరయ్యింది.

"వందేమాతరం".. అందరూ గొంతెత్తి పాడుతున్నారు. నేనూ గొంతు కలిపాను యాంత్రికంగా.

వందేమాతరం చదివాక అందరూ పరస్పరం 'శుభోదయం' చెప్పుకున్నారు. అయిదు నిముషాలు ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. తర్వాత ఎవరి పని - ప్లాటుల్లోకి వాళ్ళెళ్ళిపోయారు. ఇది మా నగరంలోనే కాదు, దేశమంతటా ఆచరిస్తున్నారట. నాకంతా అయోమయంగావుంది.

"చిన్నాడింకా ట్యూషన్నించి రాలేదా?" అడిగాను.

"ట్యూషనేంటి?" నన్ను తినేసేలా చూసింది సుభద్ర. నవ్వలేక నోటికి చేయి నడ్డంపెట్టుకుంది గౌతమి. "ఎప్పుడో ఇరవయ్యేళ్ళ నాటి సంగతులే మాట్లాడుతున్నారేంటి?"

నా అవస్థ గమనించిన గౌతమి నావద్దకొచ్చింది. సానుభూతిగా చూసింది. "నాన్నా! ట్యూషన్ సిస్టం ఇంతకు ముందు ఉండేదట. ఇప్పుడలాంటివేమీ లేవు. స్కూళ్ళలో, కాలేజీల్లో చాలా బాగా పాఠాలు చెబుతారు. రోజూ గంటకు మించని హోంవర్కు ఠంచనుగా చేసుకుపోతాం అంతే!"

"మరి వీక్ స్టూడెంట్స్.." బుర్రగోక్కున్నాను.

"అలాంటి వాళ్ళుండరు నాన్నా! ఉన్నా ప్రాథమిక విద్యలోనే ఎక్కడో ఒకచోట ఉంటారు. ఒక తరగతిలో తగినన్ని మార్కులు తెచ్చుకోకపోతే, ఎన్నేళ్ళయినా వాళ్ళని అదే తరగతిలో ఉంచేస్తారు. పై తరగతుల్లో అసలు ఆ సమస్యే ఉండదు."

"అలాగైతే చదువుకునే వాళ్ళ శాతం తగ్గదా?"

"ఏమో! ఇప్పుడు చదువురాని వాళ్ళు, చదువుకున్న వాళ్ళు అనే రెండు గ్రూపులు లేవు" గౌతమి మాటల్లో బలం, తేజం కనిపిస్తున్నాయి. ఎందుకంటే వాటికి అసత్యం వాసన తెలీదు. అయినా నమ్మలేకపోతున్నానెందుకో!

'ఇంకా నయం. ఎస్సీ, బీసీ, ఓసీల రిజర్వేషన్లు కూడా లేవనలేదు.' నాలో నేను గొణుక్కున్నా, అవి మా గౌతమికి వినిపించాయి.

"అదేంటి నాన్నా! ఏదో బీసీ-ఓసీ లంటున్నారు?"

"నాకు లేచినప్పటి నుండీ అనుమానంగానే ఉంది. ఎందుకైనా మంచిది. ముందా ధన్వంతరిగారికి ఫోన్ చెయ్యి" మా ఆవిడ విసుక్కుంది.

"అతనెవరు?" నా కనుబొమలు ముడిపడ్డాయి.

"అయ్యో! అదేంటి నాన్నా, ధన్వంతరిగారు తెలీదా? ఆయన మన కుటుంబ వైద్యులు. నిన్న రాత్రి జ్వరంగా ఉందని కషాయం తాగించి వెళ్ళారు. ఇప్పుడు జ్వరం తగ్గింది గానీ ఏదో కొత్త సమస్య తలెత్తినట్లుంది. అంతా కొత్తగా, ఏమీ తెలియనట్టు మాట్లాడుతున్నారు" అంటూ వాళ్ళ తల్లి నడిగింది- "అదేంటమ్మా నాన్న బీసీ, ఓసీ, సీసీ అని ఏమో గొణుక్కుంటున్నారు."

అంతలో మా చిన్నాడు శ్రీకాంత్ వచ్చాడు. వాడ్ని పోల్చుకోవడం కష్టమైంది.

బిళ్ళగోచీ, పంచెకట్టు, ఉత్తరీయం, నుదుట తిరుచూర్ణం.

"ఎక్కడికెళ్ళొస్తున్నావురా ఇంత పొద్దున్నే" జంకుతూనే అడిగాను.

వాడూ నన్ను విచిత్రంగానే చూశాడు. కానీ, వాడి చూపులో విసుగుదల, ఆశ్చర్యం కంటే ప్రసన్నతతో కూడిన మందహాసం కనిపిస్తోంది. అది...అదీ..అదీ ఆ..! ప్రహ్లాదుడు హిరణ్యాకశ్యపుడ్ని చూసిన చూపు.

"వేదం క్లాసుకి నాన్నా! ఇప్పుడు సైనిక శిక్షణ తరగతికెళ్ళాలి" అంటూ డ్రెస్సు మార్చుకోసాగాడు.

"మరి కాలేజీ...?" వాడు ఇంటర్ చదువుతున్నాడు.

"మధ్యాహ్నం!" నవ్వుతూనే జవాబిచ్చాడు.

తల పట్టుకోబోతున్న నన్ను కనిపెట్టి విషయమంతా చాలా వివరంగా చెప్పింది గౌతమి. పిండితాంశమేమిటంటే-

కుల వ్యవస్థ లేదు గాబట్టి, దేశంలోని ఏ మతం వారయినా సరే, 16 నుండి 18 ఏళ్ళ వరకు అంటే రెండు సంవత్సరాలు అబ్బాయిలు సైనిక శిక్షణ పొందాలి. అమ్మాయిలు ఎన్‌సీసీ శిక్షణ పొందుతారు. తమ తమ కాలేజీల్లోనే. పిల్లలంతా పన్నెండేళ్ళ వయసొచ్చేటప్పటికే భారత, రామాయణ, భాగవతాలు నేర్చుకోవాలి. ఇతర మతాల వాళ్ళు వాళ్ళ మత గ్రంథాలు నేర్చుకోవచ్చు. పదమూడో సంవత్సరం నుండీ వేద వేదాంగాల్లో తమకిష్టమైంది ఎన్నుకొని అధ్యయనం చేయాలి.

7వ తరగతి వరకు అందరూ మాతృభాషలోనే చదువుకోవాలి. ఉదయం పూట శాస్త్రాధ్యయనం-ఒక గంట. తర్వాత మధ్యాహ్నం వరకూ సైనిక శిక్షణ-అది వయసును బట్టి స్థాయి మారుతూంటుంది. మధ్యాహ్నం కళాశాల. సాయంత్రం ఒక గంట ఆట విడుపు. ఆ తర్వాత పెద్దల సేవ; ఇంటి పనులు; హోంవర్కు లాంటివి పూర్తి చేసుకుంటారు.

ఉన్నత విద్యలో ఇంగ్లీషు, జర్మనీ, జపనీస్, చైనీస్...లాంటి ఏ భాషనైనా నేర్చుకోవచ్చు. కాని, మొదట సంస్కృతం నేర్చుకోవాలి-తప్పనిసరిగా...ఇవన్నీ వింటూంటే నిజంగానే మతిపోతూన్నట్లనిపించసాగింది నాకు. కొంచెంసేపు బయటి వాతావరణం చూద్దామని వెళ్ళబోతూంటే-

"అదేంటి నాన్నా! ఆఫీసుకెళ్ళరా? ఇంకా తయారు కాలేదేం?" పెద్దవాడు గోవిందుడు డిగ్రీ చదువుతున్నాడు. ఉదయం కాలేజీకి వెళ్తాడు. మధ్యాహ్నం దగ్గర్లో ఉన్న ఊళ్ళో వ్యవసాయం చేసివస్తాడు.

"అప్పుడే ఆఫీసేంటి?" అనుకుంటూ గడియారం వంక చూశాను. ఏడున్నరవుతోంది. "మరో నలభై నిముషాల్లో బయలుదేరకపోతే సమయానికి చేరుకోలేరు. ఆలస్యంగా వెళ్లటం అవమానకరం కదా! పోయినవారం ఆ అవమానాన్ని భరించలేకనే మీ ఆఫీసులో పనిచేసే ఆంజనేయులు ఆత్మహత్య చేసుకున్నాడు కూడా..."

అదిరిపడ్డాన్నేను. కీ ఇచ్చిన బొమ్మలా చకచకా తయారుకాసాగాను.

ఆఫీసు సమయం ఎనిమిదిన్నర నుండి సాయంత్రం మూడున్నరదాకానట. 'బడి పిల్లలకు అసౌకర్యంగా ఉంటుంది కదా, ఆ సమయంలో ఆటోల్లో, బస్సుల్లో కిందా, మీదా పడి పడిపోతూంటారు. అంటే, బడిపిల్లలెవ్వరూ బస్సుల్లో, ఆటోల్లో వెళ్ళరట. ప్రతి వీధిలోనూ ఒక్కబడి ఉంటుంది. ఆ వీధి పిల్లలంతా అదే బడిలో చదవాలి. కాలి నడకనే వెళ్తారందరూ. పెద్ద చదువులకు, అంటే కాలేజీ చదువులకు కొంచెం దూరం వెళ్ళాల్సి ఉంటుంది. ఆ షెడ్యూలు మధ్యాహ్నం 2 గంటల నుండి 6 గంటల వరకు.. ఆలోచిస్తూ, ఆలోచనల మధ్య సమన్వయానికి తంటాలు పడుతూనే తయారయ్యాను.

నేను తయారవుతుండగానే గోవిందుడు తల్లికీ, నాకూ పాదాభివందనం చేసి వెళ్ళాడు శ్రీకాంత్‌లాగే.

ఏం తిన్నానో, ఎలా తయారయ్యానో- హడావుడిగా బయటపడ్డాను. అదృష్ట వశాత్తూ అపార్టుమెంటు కెదురుగానే ఆటో ఆగివుంది.

ఆఫీసు అడ్రసు చెప్పా, పోనిమ్మన్నాను లోపల కూర్చుంటూ.

ఆటోవాలా ఎగాదిగా చూశాడు నన్ను.

"దిగండి సార్!" అన్నాడు మర్యాదగా.

"మీటరు మీద ఐదు రూపాయలిస్తా!" అన్నాను దిగకుండా.

ఈసారి అతని మొహంలో కంగారూ-భయం స్పష్టంగా కనిపించసాగాయి. "ప్లీజ్ దిగండి సార్!"

"సార్! నా బతుకులో మట్టిగొట్టకండి సార్. రెండు కిలోమీటర్ల లోపు ఆటో నడపగూడదని, అందునా ఆరోగ్యవంతులను, వయసులో ఉన్నవాళ్ళను అస్సలు తీసుకొని పోగూడదని రూలుంది గద సార్. మీ ఆఫీసుకు మీరు రోజూ నడుసు కుంటనే పోతర్ గద సార్.." వాని మాటలు చిత్రంగా ఉన్నాయి. సుమారు రెండు కిలోమీటర్ల దూరం నడవక తప్పదనేది స్పష్టమైంది మొత్తంమీద.

నడిచేందుకు సమాయత్తమవుతూంటే గౌతమి పరుగెత్తుకొచ్చింది.

"నాన్నా! ఈరోజు పిక్నిక్ వెళ్తున్నాం. స్కూల్ నుండి"

"ఎక్కడికి?"

"రాచకొండ అడవులకి!"

ఉలిక్కిపడ్డాన్నేను.."అక్కడి కెందుకమ్మా? అది నక్సలైట్ల ఏరియా!"

"ఇప్పుడు నక్సలైట్లూ, పెట్రోమాక్స్ లైట్లూ లేవు నాన్నా! వాళ్ళంతా పది పది హేనేళ్ళ క్రితమే అంతరించారట. వాళ్ళ తాలూకు వాళ్ళే ఇప్పుడు అడవుల్లో గైడ్లుగా పనిచేస్తున్నారు".

నాకు తెలియని విషయాల్లో తల దూర్చడం ఇంక ఎంతమాత్రమూ ఆరోగ్య కరం కాదని స్పష్టమైంది. అమ్మాయడిగిన డబ్బులు ఇచ్చేసి నడిచా ముందుకు.

రోడ్డుమీద వాహనాలన్నీ లిమిటెడ్ స్పీడ్‌లో వెళ్తున్నాయి. కొద్దిసేపు చూసి, విసుగొచ్చి పక్కనే నడుస్తున్న మనిషి నడిగాను.

కొత్త మనిషిని చూసినట్టు చూసి- "అదేంటండీ! సిటీలో స్పీడ్ లిమిట్ ఇరవయ్యే. అంతకుమించి ఒక్క మీటరు వేగం కూడా పెంచరు."

ఇంకాస్త ముందుకెళ్తే మరో విచిత్రం కనిపించింది. సిగ్నల్ లైట్స్ చౌరస్తాలో అసలు ట్రాఫికే లేదు. అక్కడున్న ఒకే ఒక్క ఆటో గ్రీన్ సిగ్నల్ పడే దాకా ఆగి మరీ వెళ్ళింది.

ఆఫీసుకు చేరుకున్నాను. అటూ ఇటూ చూడటం వల్లనో మరేమో ఒక్క నిముషంలో నాలుగోవంతు లేటయ్యింది. చాలా అవమానంగా అనిపించింది. లోపలికి అడుగెట్టలేకపోయాను. చివరికి సూపరింటెండెంట్‌గారు స్వయంగా గుమ్మందాకా వచ్చి చెప్పారు.

"ప్లీజ్ మీరేమీ ఫీల్ కానవసరం లేదు. మీ ఆరోగ్య పరిస్థితి బాగాలేదని మీ శ్రీమతిగారు అయిదు నిముషాలు లేట్ పర్మిషన్ కోసం రిక్వెస్ట్ చేశారు. ఆ లెక్కన మీరు బిఫోర్ టైంలో వచ్చినట్టే రండి!"

ఆయన మర్యాదను తిరస్కరించలేక లోపలికెళ్ళినా నా మనసు కుదుట పడటం లేదు.

టేబుల్‌మీద ఫైళ్ళ గుట్టలు లేవు. ఓ పక్క కంప్యూటర్, మరో పక్క టేబుల్ ప్యాడ్, అయిదు నిముషాలకో ఫైలు వస్తూంది. వెళ్తుంది. ఆఫీసుకొచ్చేవాళ్ళు ఎంతో మర్యాద ఇచ్చిపుచ్చుకుంటున్నారు. వాళ్ళ మొహాల్లో బాధ ఎంత మాత్రమూ లేదు.

తిరునాళ్ళను తలపించే మా ఎమ్మార్వో ఆఫీస్ ఇదేనా? అనిపిస్తూంది. నిశ్శబ్ద వాతావరణంలో అతి తక్కువ స్థాయి కంఠస్వరంతో కార్యకలాపాలు...

పదకొండు గంటలకి చిన్న అలారం వినిపించింది. అందరూ ఏదో హడావుడి పడిపోతున్నారు. కంప్యూటర్ మానిటర్స్ నెట్‌వర్క్‌లో అందరూ ఏదో సెట్ చేసుకుంటున్నారు. నేను దిక్కులు చూడటం చూసి అటెండర్ సాజిద్ నా కంప్యూటర్‌లోనూ ఏదో సెట్ చేశాడు.

అందరూ అనుకుంటూంటే తెలిసింది. అది 'శూలారోహణ' ప్రత్యక్ష ప్రసారమట. నాకు తెలిసినంతవరకు క్రికెట్ మ్యాచ్‌లు, అసెంబ్లీ సమావేశాలు వగైరాలే ప్రత్యక్ష ప్రసారంగా చూడటం అలవాటు. 'ఇదేం ఆట?' అని గొణిగాను.

ఆ మాట సాజిద్ విన్నాడు. అతను వచ్చి వినయంగా చెప్పాడు.

"అది ఆట కాదు సార్ 'దేశద్రోహ'నికి విధించే కఠినమైన శిక్ష" అని. అప్పుడు గుర్తొచ్చింది నాకు. మౌర్య చంద్రగుప్తుని కాలంలో అలాంటిదొకటి ఉండేదని.

కార్యక్రమం ప్రారంభమైంది. సుజిత్ గాడ్సే అనే రాజకీయ నాయకుడు అబ్దుల్ సలాం అనే సైంటిస్టు దేశ భద్రత కోసం చేస్తున్న అణుశక్తి ప్రయోగ పత్రాలను పొరుగుదేశం వారికి చేరవేయడం గురించి ఫోన్‌లో మాట్లాడుతూ దొరికిపోయాడట. గాడ్సేను పట్టుకునే ప్రయత్నంలో సఫలమైన ఢిల్లీ పోలీసుల్ని ముందుగా పరిచయం చేశారు.

తర్వాత శిక్ష అమలు చేసే ఈడెన్ గార్డెన్ మైదానాన్ని చూపించారు. విశాలమైన మైదానం మధ్య పెద్ద వేదిక. ఆ వేదిక మధ్య ఓ కుర్చీ. కుర్చీ మధ్యభాగంలో ఖాళీ. సరిగ్గా దాన్ని కేంద్రంగా చేసుకొని ఒక అడుగు కింద చుట్టూ సన్నటి ముళ్ళలాంటి బ్లేడ్స్ కలిగిన ఓ శూలం. దాన్ని అదుపు చేసే స్విచ్ ఒకటి వేదిక పక్కన ఏర్పాటు చేశారు. దాన్ని ఆపరేట్ చేయడానికి ఓ మనిషి.

సుమారు లక్షకు పైగా ప్రేక్షకులు చూస్తుండగా, నిరసనలూ వ్యతిరేక నినాదాల హోరు మధ్య గాడ్సేను పెడరెక్కలు విరిచికట్టి అక్కడికి తీసుకొచ్చారు. అతని ఒంటి మీద కట్ డ్రాయర్ మాత్రమే వుంది.

అతని మొహం కళా విహీనమైపోయి వుంది. ఏడ్చి, ఏడ్చి కళ్ళు బాగా ఉబ్బి పోయినట్లున్నాయి. అతడ్ని కడసారి చూసేందుకు కుటుంబ సభ్యుల్ని పిలిపించారు.

కొడుకులు అతని మొహం చూడటమే పాపమన్నట్లు తల తిప్పుకొని వెళ్ళిపోయారు. భార్య తాళి తెంపి అతని మొహాన కొట్టి రాయడానికి వీల్లేని బూతులు తిట్టింది. కన్నతల్లి ఏకంగా కాండ్రించి ఉమ్మేసింది. ప్రేక్షకులు ఆ దృశ్యాన్ని క్రికెట్‌లో ఫోర్లూ, సిక్సర్‌లూ కొట్టినప్పుడు ఎంజాయ్ చేసినట్టు- ఎంజాయ్ చేశారు.

చివరికి ముహూర్త సమయం కాగానే చావుగంట మోగించారు. ఆపరేటర్ స్విచ్ నొక్కాడు. మూడడుగులు పైకెగిరాడు గాడ్సే. అతనితోపాటే శూలము బయటికొచ్చింది.

హాహాకారాలు చేస్తూ ప్రాణాలు విడిచాడు గాడ్సే. స్టేడియమంతా "భారత్ మాతాకీ జై!" అన్న నినాదంతో మార్మోగిపోయింది.

నా కళ్ళు బైర్లు కమ్మాయి.

* * *

ఆఫీసు నుండి ఇంటికి చేరగానే కాఫీ కలిపి ఇస్తూ అడిగింది సుభద్ర- "మీ ఓటు సోమశేఖర్‌కా? ఇంద్రబాబుకా?"

"అతనే పార్టీ? ఇతనే పార్టీ?" కాజువల్‌గా అడిగాను.

"ఏంటండీ! ఆఫీసుకెళ్తేనయినా సవ్యంగా ఆలోచిస్తారేమోనని ఆఫీసుకు పంపాను. ఇంకా మార్పు రాలేదేంటండీ మీలో!" నాపై జాలీ, సానుభూతీ ఏక కాలంలో కురిపిస్తూ చెప్పసాగింది. "పార్టీలేమిటండీ, నా మొహం? పార్టీలూ- ప్రచారాలు ఒకప్పుడుండేవి. ఇప్పుడు ఆ రెండూ లేవు. వ్యక్తి గుణశీలాల్ని బట్టి

ఓటేయాలి. పత్రికలూ-ప్రచారసాధనాలూ పోటీలో పాల్గొనే వ్యక్తుల వివరాలన్నీ నిష్పాక్షికంగా తెలియజేస్తాయి. నచ్చిన వ్యక్తికి, మనకు కేటాయించిన సమయంలో ఓటేయాలి. ఈ కాలంలో అన్నీ ఏకగ్రీవ ఎన్నికలే. మన రాష్ట్రంలోనే ఇలాంటి ముఖాముఖి పోటీలు కొన్ని మిగిలిపోయాయి...''

నా బుర్ర గిర్రున తిరుగుతోంది. "ఈ సమయం కేటాయించడమేంటి?"

"ఒక్కో కుటుంబానికి పది నిముషాల వరకూ సమయం కేటాయిస్తారు. పోలింగ్ స్టేషన్ నెంబరు, మన టైం వివరాలూ ఇందులో ఉన్నాయి" ఒక చీటీ ఇచ్చింది.

విచిత్రంగా ఆ చీటీ చూడసాగాను.

* * *

"ఏంటండీ! ఈరోజు నుండి వాకింగ్‌కి వెళ్తానన్నారు కదా! లేవండి! నేనూ వస్తా..'' శ్రీమతి అరుపులతో కూడిన కుదుపులకి మెల్లగా కళ్ళు తెరిచాను.

అంటే...అదంతా కలా? ఎంత పెద్ద కల? అందమైన కల! తెల్లవారుఝామున వచ్చే కలలు నిజమవుతాయంటారు. నా కల ఎప్పటికైనా నిజమౌతుందా?

**(15-04-2004 ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక)**